క్లుప్తంగా

నేడు సిద్దవటంలో ఉచిత వైద్య శిబిరం

సిద్దవటం : మండల కేంద్రమైన సిద్దవటం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం కడప లివిన్ డయోగ్నోస్టిక్స్ ఎండీ గాలివీటి వివేకానందరెడ్డి వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లివిన్ డయాగ్నోస్టిక్స్ మేనేజర్ సంపత్ తెలిపారు.సిద్దవటం గ్రామ ప్రజలే గాకుండా పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు కూడా ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో వాసవీక్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకుడు సుమన్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శిబిరం ఉంటుందన్నారు.

జాతీయ లోక్అదాలత్‌ను విజయవంతం చేయాలి

సిద్దవటం : మేనెల 13వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిద్దవటం కోర్టు జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస కళ్యాణ్ తెలిపారు. సిద్దవటం కోర్టులో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సిద్దవటం, అట్లూరు, ఒంటిమిట్ట మండలాల పోలీసు స్టేషన్‌ల పరిధిలోని అన్నీ సివిల్, క్రిమినల్, కేసులను, ఈ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకునే అవకాశం ఉంటుందన్నారు. వివరాలకు సిద్దవటం కోర్టులో సంప్రదించాలని ఆయన సూచించారు.

మేడే జయప్రదం చేయండి

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని సీపీఐ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జరగనున్న 137వ మేడే కార్యక్రమాలను జయప్రదం చేయాలని కార్యదర్శి గంగాధర్ తెలిపారు. 5 మండలాల నాయకులు, కార్యకర్తలు, కార్మికులు పాల్గొంటారన్నారు.

ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి

సిద్దవటం : ఆధార్ కార్డు పొంది 10 సంవత్సరాలు పూర్తి అయిన ప్రతి ఒక్కరూ తమ ఆధార్ కార్డును తప్పనిసరిగా అప్‌డేట్ చేయించుకోవాలని ఎంపీడీఓ ఫణిరాజకుమారి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఆమె మాట్లాడుతూ మేనెల 2వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలో ఆధార్ కార్డు నమోదు కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. 0–5 సంవత్సరాల లోపు పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాలలో పౌష్టికాహారం పొందాలంటే వారికి ఆధార్ కార్డులు తప్పనిసరి అన్నారు. అలాగే 10 సంవత్సరాలు పూర్తి అయిన వారు వారి ఆధార్ కార్డును ఆధార్ నమోదు కేంద్రంలో అప్‌డేట్ చేయించుకోవాలని సూచించారు.

టీటీసీ విద్యార్థులకు వేసవి శిక్షణ

రాయచోటిటౌన్ : టీటీసీ (టీచర్స్ ట్రైనింగ్) పూర్తి చేసిన వారికి వేసవి కాలపు శిక్షణ నిర్వహిస్తున్నట్లు శిక్షణ కేంద్రం డైరెక్టర్ డి. దేవనాథరెడ్డి తెలిపారు. విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, కడప, అనంతపురంలలో ఈ శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణలో పాల్గొనదలచిన విద్యార్థుల వయస్సు 18 నుంచి 45 సంవత్సరాల లోపు ఉండాలన్నారు. ఆసక్తిగల మే 6తేదీ లోగా దరఖాస్తులను సమర్పించాలన్నారు. మరింత సమాచారం కోసం కడపలోని డీఈఓ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

ఉన్నత లక్ష్యం కలిగి ఉండాలి

రాయచోటిటౌన్ : లక్ష్యం ఉన్నతమైనదై ఉండాలని.. ఆ లక్ష్య సాధనకు మొక్కవోని దీక్షతో ప్రయత్నాలు చేసినప్పుడే మనం ఉన్నత శిఖరాలకు చేరుకోగలమని రాయచోటి సీఆర్ రెడ్డి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం తృతీయ సంవత్సరం పరీక్షలు పూర్తి చేసుకున్న విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ పట్టా ఒక్కటే చాలదని నేటి తరం పోటీ ప్రపంచంలో మంచి ఉద్యోగం సాధించాలంటే మరింత మెరుగైన ప్రతిభ చాలా అవసరమన్నారు. అందుకు నిరంతరం కృషి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ గణేష్ కుమార్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో
అవినీతి, అక్రమాల నిర్మూలనే లక్ష్యం

ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



రాయచోటి : సబ్‌రిజిస్ట్రార్, తహసీల్దార్ తదితర ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి, అక్రమాల నిర్మూలనే లక్ష్యంగా అందరూ సహకరించాలని రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల ద్వారా సామాన్యుడికి న్యాయం జరగడంతో పాటు అన్యాయానికి గురి కాకూడదన్నదే ప్రధాన ఉద్దేశం అన్నారు. భూముల విలువ పెరగడంతో అమ్మకాలు, కొనుగోళ్లలో అవినీతి పెరిగిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సైతం అవినీతిని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఎక్కడ అవినీతి జరిగినా చర్యలు చేపట్టేందుకు విజిలెన్స్, ఏసీబీ ఇతర నిఘా విభాగాలు కూడా ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం సూచించారన్నారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కానివ్వకుండా ప్రజలకు ఉపయోగపడేలా చూడాలన్నారు. సబ్‌రిజిస్ట్రార్, తహసీల్దార్ కార్యాలయాల్లో అవినీతి ఎక్కువగా జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఏ ఒక్క కార్యాలయంలోనూ అవినీతి పనులకు తన పేరు వినియోగించినా నమ్మవద్దని ఎమ్మెల్యే కోరారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఏ ఒక్కరికీ, ఏ నాడూ మద్దతు ఇచ్చే ప్రసక్తి ఉండదు, ఇవ్వబోనని తేల్చిచెప్పారు. దొంగ రిజిస్ట్రేషన్లు, మిలిటరీ పట్టాలలో జరిగిన అవినీతిపై పూర్తిగా నిఘా ఉందన్నారు. భూముల విషయాలలో నష్టపోయిన వాళ్లు నేరుగా కానీ, రాతపూర్వకంగా కానీ పత్రికల ద్వారా తెలియపరిచినా తప్పకుండా విచారణ చేయించి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలకు సంబంధించిన ప్రభుత్వ భూములతో పాటు, ఏ సర్వే నెంబర్ భూమి వివరాలైనైనా, ఎస్‌టీసీల వివరాలను ఎవరు అడిగినా అందించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. భూములు అన్యాక్రాంతం కాకూడదు, నిబంధనలకు వ్యతిరేకంగా ఏ పని జరగకూడదన్నదే తమ అభిమతమన్నారు. ప్రజలకు మేలు చేయడంతో పాటు రాయచోటి అభివృద్ధికి అందరమూ కలిసి ముందుకు నడుద్దామని ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి కోరారు.

జగనన్న ప్రభుత్వానికి విశేష మద్దతు

జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే

రాజంపేట : రాష్ట్ర ప్రజలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రజలు తెలిపిన విశేష మద్దతు చరిత్రాత్మకమని జెడ్పీచైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వంపై ప్రజలు స్వచ్ఛందంగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడం గొప్ప కార్యక్రమం అని కొనియాడారు. రాజంపేట నియోజకవర్గంలో మొత్త 93, 844 గృహాలు ఉండగా ఇందులో 80,000 ఇళ్లు సందర్శించామన్నారు. జగనన్నకు మద్దతు ఇస్తూ రాజంపేట నియోజకవర్గ వ్యాప్తంగా 56వేల మిస్స్‌డ్ కాల్స్ ఇచ్చారన్నారు. దేశంలో ఏ రాజకీయపార్టీ చేపట్టలేని అతిపెద్ద పబ్లిక్ సర్వేగా జగనన్నే మా భవిష్యత్తు మెగా పీపుల్స్ సర్వే నిలిచిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొల్లినేని రామ్మోహన్‌నాయుడు, నియోజకవర్గ జేసీఎస్ ఇన్‌చార్జులు వడ్డె రమణ, మందరం గంగిరెడ్డి, ఖలీం, రెహమాన్‌ఖాన్, నరేష్, జిల్లా వక్ఫ్‌బోర్డు సెక్రటరీ అమీర్. వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న జెడ్పీచైర్మన్ అమరనాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

బీజేపీపై బాబుకు అంత ప్రేమ ఎందుకో



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్‌ఖాన్

రాయచోటి అర్బన్ : నిన్న మొన్నటివరకు బీజేపీ ప్రభుత్వంపై మండిపడిన చంద్రబాబుకు ఉన్నట్లుండి ఆపార్టీపై ఎందుకు ప్రేమ పుట్టుకొచ్చిందని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు బేపారి మహబూబ్‌ఖాన్, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఫయాజుర్ రహిమాన్‌లు ప్రశ్నించారు. శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు బీజేపీతో పొత్తుపెట్టుకున్నా రన్నారు. 2019 ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని మరోమారు అధికారంలోకి రానివ్వనంటూ ప్రతిజ్ఞ చేశారన్నారు. ఇప్పుడేమో ఉన్నట్లుండి తన రాజకీయ ప్రయోజనాల కోసం ప్రధాని మోదీపై ప్రశంసల జల్లు కురిపిస్తుండడం చంద్రబాబు రెండునాల్కల ధోరణికి నిదర్శనమన్నారు. నేడు మైనార్టీలపై కల్లిబొల్లి ప్రేమను చూపుతున్న చంద్రబాబు తన పరిపాలనలో ముస్లింలకు చేసిన మేలు ఏదీ లేదన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నా సలీం, కొత్తపల్లె ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రవాసాంధ్రులకు వైఎస్సార్‌సీపీ సేవలు ఎనలేనివి

మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి

రాజంపేట టౌన్ : కువైట్‌లో ఉంటున్న ప్రవాసాంధ్రులకు కువైట్ వైఎస్సార్‌సీపీ ప్రతినిధులు అందిస్తున్న సేవలు ఎనలేనివని మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. లక్కిరెడ్డిపల్లెకు చెందిన వేల్పుల రవిశంకర్ కువైట్‌లో విధి నిర్వహణలో గాయపడి ఎడమకాలికి చెందిన ఐదు వేళ్లు కోల్పోయాడు. దీంతో ఏపీఎన్ఆర్‌టీఎస్ (ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెన్షియల్ తెలుగు సొసైటీ) డైరెక్టర్‌లు ఇలియాస్, ముమ్మడి బాలిరెడ్డిల కృషి ఫలితంగా రవిశంకర్‌కు ప్రవాసాంధ్ర బీమా కింద రూ.2 లక్షలు మంజూరైంది. ఈ నగదుకు సంబంధించిన చెక్కును శనివారం మండలంలోని బోయినపల్లెలో ఉన్న ప్రవాసాంధ్రుల సేవా కేంద్రంలో మున్సిపల్ చైర్మన్ చేతుల మీదుగా రవిశంకర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ జీవనోపాధి కోసం గల్ఫ్‌కు వెళ్లే వారు గతంలో అనేక ఇబ్బందులు పడుతుండేవారని, జగన్ సీఎం అయ్యాక వారి సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక దృష్టిసారించారన్నారు. అందులో భాగంగానే ఏపీఎన్ఆర్‌టీసీని ఏర్పాటు చేశారని తెలిపారు. కువైట్‌లో ఉండే తెలుగు ప్రజలకు సేవలందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీకే దక్కుతుందన్నారు. లబ్ధిదారుడు రవిశంకర్ మాట్లాడుతూ ప్రవాసాంధ్రులను ఆదుకునేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న చర్యల వల్ల జీవనోపాధి కోసం కువైట్‌లో ఉంటున్న ఆంధ్ర ప్రజలకు ఎనలేని మేలు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎన్ఆర్‌టీఎస్ కువైట్ రీజనల్ కో–ఆర్డినేటర్ ఎస్ జాఫర్ అలీ, మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి, కౌన్సిలర్లు సూరి, న్యామతుల్లా, వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు తోట లక్ష్మీనారాయణ, ఖాజా తదితరులు పాల్గొన్నారు.



రవిశంకర్‌కు చెక్కును అందచేస్తున్న పోలా శ్రీనివాస్‌రెడ్డి

బీజేపీ విధానాలు దేశానికి ప్రమాదకరం



బహిరంగసభలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు

రాయచోటి అర్బన్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు దేశానికే ప్రమాదకరమని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, సీపీఐ జిల్లాకార్యదర్శి పి.ఎల్.నరసింహులు అన్నారు. బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా రాయచోటి బస్టాండు సర్కిల్‌లో శనివారం సాయంత్రం ప్రచారభేరి బహిరంగసభ నిర్వహించారు. వారు మాట్లాడుతూ మోదీ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలతోఅన్నిరకాల ధరలు పెరుగుతున్నాయన్నారు. గతంలో 32మంది ప్రాణత్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరించడం అన్యాయమన్నారు. బీజేపీ అనుసరిస్తున్న మతోన్మాద, ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకించే దమ్ము ఒక వామపక్ష పార్టీలకే ఉందన్నారు. కార్యక్రమంలో వామపక్షనేతలు ఎం.రామాంజులు, శ్రీనివాసులు, పెంచలయ్య, హరిశర్మ, కృష్ణప్ప, మహేష్, రంగారెడ్డి, సాంబశివ, నరసింహ, భాస్కర్, భాగ్యలక్ష్మి, సుమిత్ర, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది బదిలీలపై పునఃపరిశీలించాలి

రాయచోటి అర్బన్ : సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది బదిలీలపై ప్రభుత్వం పునః పరిశీలన చేయాలని ఏపీజేఏసీ అన్నమయ్య జిల్లా కార్యదర్శి బి.మల్లికార్జున డిమాండ్ చేశారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని శనివారం ఏపీజేఏసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు వేణు, లక్ష్మీనారాయణ, మాధవి, హరిప్రసాద్, శివశంకర్‌రాజు, సోమేశ్వర్, ఆర్టీసీ యూనియన్ నాయకులు ఈశ్వర్‌రెడ్డి, పీఎస్‌బీరెడ్డి పాల్గొన్నారు.

పునరావాస కాలనీలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం



సంక్షేమ ఫలాల బుక్‌లెట్‌ను ప్రజలకు అందిస్తున్న తల్లెం భరత్ కుమార్ రెడ్డి

ఓబులవారిపల్లె : మండల పరిధిలోని మంగంపేట పునరావాసకాలనీలోని 3,4,5,6 వీధులలో శనివారం గుంతకల్ రైల్వేబోర్డు మెంబర్ తల్లెం భరత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం ప్రవేశపట్టిన సంక్షేమ ఫలాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం వారి అనుమతితో ఇంటిగోడపైన జగనన్న స్టిక్కర్లను అతికించారు. ఈ కార్యక్రమంలో శారదమ్మ, అమీనా, లత, వెంకటేష్, మల్లి, రమణ, సునీల్, సుబ్రమణ్యం, సుబ్బయ్య, పుల్లయ్య, రమణ, వెంకటసుబ్బయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పిల్లల పట్ల శ్రద్ధ వహించాలి

ఓబులవారిపల్లె: వేసవి సెలవులలో తల్లిదండ్రులు పిల్లల పట్ల శ్రద్ధ వహించాలని సీనియర్ ఉపాధ్యాయుడు సుబ్బారెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలె తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు పిల్లలు వేసవి సెలవుల్లో చదివేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సి.శ్రీనివాసులు, రాజునాయక్, రేవతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష

సిద్దవటం : మండల కేంద్రమైన సిద్దవటంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 5వ తరగతి నుంచి 6వ తరగతి ప్రవేశం కోసం సిద్దవటం, అట్లూరు, ఒంటిమిట్ట మండలాలకు చెందిన 210 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 20 మంది గైర్హాజరయ్యారు. ప్రిన్సిపల్ గీత పర్యవేక్షించారు.

బడి బయట పిల్లలను బడిలో చేర్పిద్దాం

గాలివీడు: బడికి దూరంగా ఉన్న పిల్లలను గుర్తించి బడిలో చేర్పిద్దామని ప్రధానోపాధ్యాయుడు బి.రెడ్డెన్న పేర్కొన్నారు. శనివారం ఆయ స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పాఠశాల కమిటీ చైర్మన్ రజితతో కలిసి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి సెలవు దినాలలో బడి బయట పిల్లలను, ఆవాస ప్రాంతాల్లోని పిల్లలను గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల బలోపేతానికి ప్రభుత్వం కృషి



అంగన్‌వాడీ వర్కర్స్‌కు నియామకపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

రాజంపేట : అంగన్‌వాడీల బలోపేతానికి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. శనివారం ఎమ్మెల్యే కార్యాలయంలో నూతనంగా నియామకాలు పొందిన అంగన్‌వాడీ వర్కర్స్‌కు నియామకపత్రాలను అందచేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో అంగన్‌వాడీల ద్వారా చిన్నారుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి అనేక సంక్షేమ కార్యక్రమాలను తీసుకువస్తున్నారన్నారు. ఈ తరుణంలో అంగన్‌వాడీ సెంటర్ల నిర్వాహకులు తమ పనితీరును మెరుగుపరుచుకోవాలన్నారు. ప్రభుత్వ లక్ష్యాలను అధిగమించేలా కృషిచేయాలన్నారు. అంగన్‌వాడీ పిల్లలను తమ పిల్లలుగా భావించాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ నిర్మల, వైఎస్సార్‌సీపీ రూరల్ అధ్యక్షుడు రామ్మోహన్‌నాయుడు, సర్పంచ్ జగన్, ఏరియా హాస్పిటల్ డైరెక్టర్ ఉమామహేశ్వరరెడ్డి, వడ్డెశ్రీను, వైఎస్సార్‌సీపీ నాయకులు పునగాని గుణయాదవ్, దాసరి పెంచలయ్య, బీమరాజు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రగతి నివేదిక అందజేత



మాట్లాడుతున్న పాఠశాల హెచ్‌ఎం తులసీధర్

సిద్దవటం : విద్యార్థుల ప్రగతి నివేదికను వారి తల్లిదండ్రుల చేతనే పిల్లలకు ఇప్పించామని బొగ్గిడివారిపల్లె ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తలసీధర్ అన్నారు. సిద్దవటం మండలంలోని బొగ్గిడివారిపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం పేరెంట్స్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ పిల్లలు కనీసం రోజుకు ఒక గంట అయినా చదివేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. పాఠశాలలో చేపట్టిన నాడు–నేడు పనులు జూన్ నెలకు పూర్తి అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు రాధ, పేరెంట్స్ కమిటీ సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

ఎంఈఓ శంకరయ్య

సిద్దవటం : విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి మంచి పురోగతి సాధించాలని ఎంఈఓ శంకరయ్య తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటంలోని శ్రీ నలంద హైస్కూల్‌లో శనివారం సాయంత్రం పాఠశాల గేయాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాల ఉపాధ్యాయులు సమయ పాలన పాటిస్తూ అంకిత భావంతో పనిచేస్తున్నారన్నారు. విద్యార్థులు తొలుత తల్లిదండ్రులను, తరువాత గురువులను పూజించాలన్నారు. క్రమశిక్షణతో చదివితే ఎక్కడికి వెళ్లినా విజయాలు సాధిస్తారన్నారు. చదువుతో పాటు సమాజానికి కూడా తోడ్పడాలని ఆయన కోరారు. అనంతరం చేతిరాత పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఎంఈఓ బహుమతులను అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం ప్రసన్న, కరస్పాండెంట్ బాలుగారి వెంకటసుబ్బయ్య, రచయితలు బాల చెన్నయ్య, లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పవన్, శాంతి, పద్మావతి, చిన్నబాబు , విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ శంకరయ్య

రేబిస్ వ్యాధి నివారణకు సహకరించాలి



ప్రాంతీయ పశువైద్య కార్యాలయంలో రేబిస్ టీకాలు వేస్తున్న వైద్యసిబ్బంది

రాజంపేట రూరల్ : కుక్కల నుంచి మనుషులకు సంక్రమించే రేబిస్ వ్యాధి నివారణకు పెంపుడు జంతువుల యజమానులు టీకాలు వేయించుకొని సహకరించాలని పశువైద్య ఉపసంచాలకులు(డీడీ) డాక్టర్ అబ్దుల్ ఆరీఫ్ కోరారు. స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలలో ప్రపంచ పశువైద్య దినోత్సవం సందర్భంగా శనివారం పెంపుడు కుక్కలకు ఉచిత రేబిస్ టీకాలు వేసే కార్యక్రమం నిర్వహించారు. అలాగే నూతనంగా పశువైద్యశాలలో ఏర్పాటు చేసిన శస్త్ర చికిత్స విభాగంలో పెంపుడు, వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ కె. ప్రతాప్, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ ఎం .వరదయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

నీటిసరఫరా, పారిశుధ్య సమస్యలకు వెంటనే పరిష్కారం

రాయచోటి అర్బన్: మున్సిపల్ పరిధిలోని తాగునీటి సరఫరా, పారిశుధ్య సమస్యలకు వెంటనే పరిష్కారం చూపుతామని మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ అన్నారు. శనివారం ఆయన కౌన్సిలర్లు సాదక్‌అలీ, గౌస్‌ఖాన్‌లతో కలసి పట్టణంలోని పలువీధులలో తిరిగారు. పలువీధుల రోడ్లకంటే ఎన్‌హెచ్‌రోడ్డు ఎత్తులో ఉన్నందున వెంటనే రోడ్ల అనుసంధానం, పైపులైన్ ఇంటర్ కనెక్షన్ పనులు చేయాలని కౌన్సిలర్లు కోరారు. ఇందుకు కమిషనర్ స్పందిస్తూ వెంటనే ఆయా సమస్యలను పరిష్కరించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్ఐ మల్లికార్జున, ఉద్యోగులు పాల్గొన్నారు.

గ్రామీణ విద్యార్థుల్లోనే అపార మేథాశక్తి

సంబేపల్లె : పట్టణ,నగర విద్యార్థులకంటే గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లోనే అపారమైన మేధాశక్తి ఉంటుందని చెన్నై ఐఐటీ ప్రొఫెసర్ చెలియన్ అరుణాచలం తెలిపారు. శనివారం ఇస్రో శాస్త్రవేత్త, చంద్రయాన్ ప్రాజెక్టు మేనేజర్ సౌజన్యతో కలిసి జిల్లాపరిషత్, ఆదర్శ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులలో కష్టపడే మనస్తత్వం అధికంగా ఉంటుందన్నారు. ఆటుపోట్లు, ఒడిదుడుకులకు ఎదురొడ్డి నిలిచి విజయం సాధించేంత వరకు పోరాట పటిమ చూపుతారన్నారు. అనంతరం పశుపతినాథాలయం, శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



జెడ్పీఉన్నత పాఠశాలలో ఐఐటీ ప్రొఫెసర్ చెలియాన్ అరుణాచలం ,ఇస్రో శాస్త్రవేత్త సౌజన్య

• పూజలు గైకొనుమా



పూజలు అందుకున్న మర్రిచెట్టు లక్ష్మీనరసింహస్వామి

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని పలు ఆలయాలలో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాయచోటి–వేంపల్లి రహదారి మార్గంలోని మర్రిచెట్టు లక్ష్మీనరసింహస్వామి ఆలయం, గద్దగుండ్లరాచపల్లి సమీపంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంతోపాటు అయ్యప్పస్వామి ఆలయం,రెడ్డివారిపల్లి రోడ్డు మార్గంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

• శ్రీనివాసా గోవిందా..



పూజలు అందుకుంటున్న వెంకటేశ్వరస్వామి

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున భక్తులు ఆలయానికి వచ్చి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. స్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకారం చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

• గంగమ్మా.. కాపాడమ్మా



శ్రీపాగేటి గంగమ్మ

సంబేపల్లె : మండల పరిధిలోని శెట్టిపల్లె పంచాయతీ గాండ్లపల్లె సమీపంలో వెలసిన శ్రీ పాగేటి గంగమ్మ తిరునాల శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని వివిధ రకాల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. అమ్మవారిని దర్శించుకొనేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు.

• నరసింహా నమోస్తుతే



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీన రసింహస్వామి

చిన్నమండెం : మండలంలోని దేవగుడిపల్లె గ్రామం జల్లావాండ్లపల్లె గ్రామంలోని శ్రీ మండెం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం కావడంతో మూలవిరాట్‌మూర్తిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. సమీప ప్రాంతాల భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

• కల్యాణం.. కమనీయం



సీతారాముల కల్యాణ దృశ్యం

పెనగలూరు : మండలంలోని నడిమిసిద్దవరం గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో శ్రీ సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. సిద్దవరం సర్పంచ్ రాఘవరెడ్డి ప్రేమలత, వెంకటేశ్వరరెడ్డి దంపతులు ఈ కల్యాణాన్ని నిర్వహించారు. రాత్రి అన్నదానం, అనంతరం చెక్కభజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం శ్రీ సీతారాముల ఊరేగింపు జరగనుంది.

• ఘనంగా ఆరాధన

రాజంపేట టౌన్ : పట్టణంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఆదివారం వీరబ్రహ్మేంద్ర స్వామి 330వ ఆరాధన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు రాచగుండ్ల లక్ష్మీప్రసన్నాచారి ఒక ప్రకటనలో తెలిపారు. ఆరాధన మహోత్సవాన్ని పురస్కరించుకొని వేకువ జాము నుంచి స్వామివారికి విశేషంగా పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఉదయం 7 గంటలకు సుప్రభాతసేవ, 10 గంటలకు అభిషేకం, సహస్ర నామార్చన, 11–30 గంటలకు మహానైవేద్యం, మంగళహారతి కార్యక్రమాలు ఉంటాయన్నారు. 12–30 గంటల నుంచి సహపంక్తి భోజన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. సాయంత్రం 6 గంటల నుంచి గ్రామోత్సవం, రాత్రి 8 గంటలకు ఉంజల్‌సేవ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.